
APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com

తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి  ఎడిటర్ : సి హరికృష్ణ  శుక్రవారం 10, జూలై 2026  సంపుటి: 01  సంచిక :44  పేజీలు : 04  వెల: 2-00/-



## భారత్-ఆస్ట్రేలియా బంధం బలోపేతం

- మెల్‌బోర్న్‌లో మోదీ, అల్బనీస్ భేటీ
- వాణిజ్యం, పెట్టుబడుల పెంపుపై చర్చలు
- రక్షణ, ఇంధన రంగాల్లో సహకారానికి నిర్ణయం

మెల్‌బోర్న్, జులై 9: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో మెల్‌బోర్న్‌లో గురువారం ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్--ఆస్ట్రేలియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య పురోగతిని ఇరు దేశాల నాయకులు సమీక్షించారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. వాణిజ్యం, పెట్టుబడులను మరింత పెంచేందుకు సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందాన్ని త్వరితగతిన పూర్తిచేసే దిశగా కలిసి పనిచేయాలని ఇరు దేశాల ప్రధానులు అంగీకరించారు. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే రెండు దేశాల మధ్య వాణిజ్య, పారిశ్రామిక సంబంధాలు మరింత విస్తరించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అత్యవసర ఖనిజాలు, పునరుత్పాదక ఇంధనం, అణుశక్తి, ఆధునిక సాంకేతికత, విద్య, వాతావరణ మార్పుల నివారణ వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో ఉమ్మడి భాగస్వామ్యం అవసరమని ఇరు నాయకులు అభిప్రాయపడ్డారు. రక్షణ, నౌకల నిర్మాణ రంగాల్లో కూడా పరస్పర సహకారాన్ని బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. హిందూ--ప్రశాంత ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని కాపాడేందుకు రెండు దేశాలు కలిసి పనిచేయాలని ప్రధానులు స్పష్టం చేశారు. భారత్--ఆస్ట్రేలియా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఇటీవలి కాలంలో మరింత బలపడుతోందని సమావేశంలో ప్రస్తావించారు.

## భూవివాదాలకు శాశ్వత పరిష్కారం



- 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- 2027 నాటికి 72.70 లక్షల పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ
- రాయలసీమ అభివృద్ధికి భారీ పెట్టుబడులు ప్రకటించిన సీఎం

నంద్యాల, జులై 9 : రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, ఆంధ్రప్రదేశ్‌ను భూవివాద రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించిన 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లను పంపిణీ చేసి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజల ఆస్తులకు పూర్తి భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య చట్టం ప్రజల్లో భయాందోళనలు సృష్టించిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజల భూములను వివాదాల్లోకి నెట్టే విధానాలకు స్వస్తి పలికి, రాష్ట్ర రాజముద్రతో పాటు అత్యాధునిక భద్రతా అంశాలతో కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లను అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పవిత్ర ఉద్యమంగా చేపట్టామని, 2027 మార్చి నాటికి రాష్ట్రంలోని 9,833 గ్రామాల్లో 72,70,605 పట్టాదారు పాస్‌బుక్‌లను పంపిణీ చేస్తామని వెల్లడించారు. భూ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చంద్రబాబు పేర్కొన్నారు. తిరుపతి, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను పరిష్కరించినట్లు తెలిపారు. డోన్ నియోజకవర్గంలో 2,074 ఎకరాల వక్ఫ్ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి రైతులకు న్యాయం చేశామని చెప్పారు. వారసత్వ ఆస్తుల బదిలీని సులభతరం చేసేందుకు ఆటో మ్యుటేషన్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. రాయలసీమ అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కడప ఉక్కు కర్మాగారం, హీరో మోటార్స్, యుద్ధ విమానాల తయారీ పరిశ్రమతో పాటు పలు భారీ పారిశ్రామిక ప్రాజెక్టులు రాయలసీమకు రానున్నాయని తెలిపారు. రూ.40 వేల కోట్ల ప్రభుత్వ పెట్టుబడులు, రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను ఉద్యానవన పంటల కేంద్రంగా తీర్చిదిద్దే కార్యాచరణ చేపట్టామని వివరించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని చంద్రబాబు తెలిపారు.



## కొత్త నీటి ట్యాంకు ప్రారంభం

- మచిలీపట్నంలో 90 వేల లీటర్ల సామర్థ్యం
- స్వచ్ఛమైన తాగునీటి సరఫరాపై దృష్టి
- మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం, జులై 9 : మచిలీపట్నం క్యాంప్‌బెల్‌పేటలో 90 వేల లీటర్ల సామర్థ్యంతో నూతనంగా నిర్మించిన తాగునీటి నిల్వ ట్యాంకును రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్‌టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు గురువారం ప్రారంభించారు. ఈ ట్యాంకు ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని నిరంతరం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.

## తిరుమలలో భక్తుల రద్దీ



- సర్వదర్శనానికి 18 గంటల నిరీక్షణ
- కిక్కిరిసిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్
- ఒక్కరోజే రూ.5.15 కోట్ల హుండీ ఆదాయం

తిరుమల, జులై 9 : కలియుగ వైకుంఠంగా ప్రసిద్ధి చెందిన తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. దేశం నలుమూలల నుంచి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో తిరుమాడ వీధులు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోవడంతో క్యూలైన్లు వెలుపల వరకు విస్తరించాయి. ప్రస్తుతం టైమ్‌స్లాట్ దర్శన టోకెన్లు లేని సాధారణ భక్తులకు సర్వదర్శనం లభించడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో భక్తులు తమ ప్రయాణాన్ని ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులను దృష్టిలో ఉంచుకుని మంచినీరు, పాలు, కాఫీ, అన్నప్రసాదాలను సిబ్బంది నిరంతరం పంపిణీ చేస్తున్నారు. వైద్య బృందాలను కూడా అందుబాటులో ఉంచి అవసరమైన సేవలు అందిస్తున్నారు. టీటీడీ గణాంకాల ప్రకారం బుధవారం మొత్తం 82,172 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వారిలో 36,978 మంది కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. రద్దీ ఉన్నప్పటికీ దర్శన ఏర్పాట్లను అధికారులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం కూడా గణనీయంగా నమోదైంది. ఒక్కరోజే హుండీ ద్వారా రూ.5.15 కోట్ల ఆదాయం లభించినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. భక్తులు పెద్ద ఎత్తున కానుకలు సమర్పిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా భక్తుల రద్దీ కొనసాగే అవకాశం ఉన్నందున తిరుమలకు వచ్చే భక్తులు టీటీడీ సూచనలను పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. దర్శనం, వసతి, ప్రసాదాల పంపిణీ తదితర సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



## ఆలయాల అభివృద్ధికి భారీ నిధులు

- సీజీఎఫ్ కమిటీలో కీలక నిర్ణయాలు
- 659 దేవాలయాల అభివృద్ధికి రూ.789.92 కోట్లు
- గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

అమరావతి, జులై 9 : రాష్ట్రంలోని హిందూ ధార్మిక సంస్థల అభివృద్ధి, ఆలయాల పునరుద్ధరణ, 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. గురువారం సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆలయాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఆలయాల అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇప్పటికే రూ.181.38 కోట్ల వ్యయంతో 282 దేవాలయాల్లో పెండింగ్ పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 659 దేవాలయాల అభివృద్ధి కోసం రూ.789.92 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నిధులతో ఆలయాల మౌలిక సదుపాయాల కల్పన, పునరుద్ధరణ పనులను వేగవంతంగా చేపడుతున్నామని చెప్పారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని 276 దేవాలయాల అభివృద్ధికి రూ.87.03 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో సేవలందిస్తున్న అర్చకులకు అండగా నిలిచే ధూపదీప నైవేద్య పథకాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. కొత్తగా అర్హత సాధించిన 122 దేవాలయాలను ఈ పథకంలో చేర్చనున్నట్లు వెల్లడించారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో రూ.750 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఆలయం లేదా భజన మందిరం ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

అనంత సూర్య తెలుగువార్త

శుక్రవారం 10 జూలై 2026

# ధర్మవరంలో ఘనంగా ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**• విద్యార్థి శక్తిని జాతి నిర్మాణం వైపు నడిపిస్తున్న గొప్ప ఉద్యమం ఏబీవీపీ: హరీష్ బాబు**

**• దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణకు ప్రతీకగా ఏబీవీపీ నిలిచింది**

ధర్మవరం, జూలై 09 అనంత సూర్య: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ధర్మవరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజ్ సర్కిల్ నుంచి గాంధీనగర్ వరకు భారీ విద్యార్థి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వందలాది మంది విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు, విద్యాభిమానులు పాల్గొని దేశభక్తి నినాదాలతో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమానికి పూర్వ రాష్ట్ర ఏబీవీపీ నాయకులు, మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1949 జూలై 9న ప్రారంభమైన ఏబీవీపీ 78 ఏళ్లుగా విద్యార్థి సమాజానికి మార్గదర్శిగా నిలుస్తూ, దేశంలోనే అతిపెద్ద విద్యార్థి ఉద్యమంగా ఎదిగిందన్నారు. దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించడంలో ఏబీవీపీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, జాతీయ చైతన్యం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంతో పాటు విద్యా వ్యవస్థ అభివృద్ధికి, దేశ నిర్మాణానికి అవసరమైన ఆలోచనలను ముందుకు తీసుకెళ్తూ ఏబీవీపీ నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు. విద్య -- వ్యక్తిత్వ వికాసం -- సేవ అనే సిద్ధాంతంతో పనిచేస్తున్న ఏబీవీపీ యువతలో భారతీయ సంస్కృతి, జాతీయ భావన, సామాజిక బాధ్యతలను పెంపొందిస్తూ భావి భారత నిర్మాణానికి బలమైన పునాదులు వేస్తోందని హరీష్ బాబు అన్నారు. అనంతరం ఏబీవీపీ జెండాకు వందనం చేసి, సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఏబీవీపీ నాయకులు బిల్లే రవి, మురళి గౌడ్, శంకర చంద్ర, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గిరి వాల్మీకి, నగర కార్యదర్శి శివ, బీజేపీ మండల అధ్యక్షులు గొట్లూరు చంద్ర, ప్రకాష్ గౌడ్, జూటూరు వెంకటేష్, నారా కొండయ్య చౌదరి, ఏబీవీపీ నాయకులు విష్ణు చరణ్, విశ్వనాథ్, సంతోష్, హితేష్, సాయి, విద్యార్థులు, కార్యకర్తలు, అధ్యాపకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి




సోమందేపల్లి, జూలై 9 అనంత సూర్య: ఈ నెల 27, 28, 29 తేదీల్లో శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమందేపల్లి సీపీఐ పార్టీ కార్యాలయంలో గురువారం శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. హిందూపురం నియోజకవర్గంలోని లేపాక్షి మండల కేంద్రంలో మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణా తరగతులకు సీపీఐ జాతీయ, రాష్ట్ర నాయకులతో పాటు ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, మేధావులు హాజరై వివిధ అంశాలపై ప్రసంగించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, మండల కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, ముఖ్య నాయకులు పెద్దఎత్తున పాల్గొని శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ బాలస్వామి, మండల కార్యదర్శి కామ్రేడ్ రాజగోపాల్, నాయకులు శీలా నారాయణస్వామి, గంగరాజు, మల్లేష్, రాజేష్, సహాయ కార్యదర్శి అంజనమ్మ, నూర్జాన్, బేబీ, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణంలో రాష్ట్రంలోనే శ్రీ సత్యసాయి జిల్లా అగ్రస్థానం







**ప్రగతిపై హౌసింగ్ ఎండీ అరుణ్ బాబు, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సమీక్ష**

పుట్టపర్తి, జూలై 9 అనంత సూర్య: గృహ నిర్మాణ పథకం అమలులో శ్రీ సత్యసాయి జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందని హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. జిల్లాలో గృహ నిర్మాణాల ప్రగతిపై గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ బాబు మాట్లాడుతూ, జూన్ నెలలో గృహ నిర్మాణ పథకాలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం 93.56 శాతానికి చేరి రాష్ట్రంలోనే తొలి స్థానం సాధించడం అభినందనీయమన్నారు. జిల్లాలో మంజూరైన 57,889 ఇళ్లలో ఇప్పటికే 28,639 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన 29,250 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు రూ.700.07 కోట్ల వ్యయం చేసినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ 7వ విడతలో మంజూరైన 3,051 ఇళ్లలో 2,474 ఇళ్లకు (81.09 శాతం) గ్రౌండింగ్ పూర్తి చేసి జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ధర్మవరం, హిందూపురం, కదిరి, పుట్టపర్తి పట్టణాల్లో మిగిలిన ఇళ్ల జియో ట్యాగింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే నిధులు సకాలంలో చేరేలా ఎఫ్‌టీఓలను రూపొందిస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి జిల్లాను గృహ నిర్మాణంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, హౌసింగ్ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



**• ఈ నెల 11న జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు**

పుట్టపర్తి, జూలై 9 అనంత సూర్య: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ప్రత్యేక పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 11న జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కలెక్టరేట్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. "పిల్లల మధ్య ఎడం -- ఆరోగ్యకరమైన, ఆనందకరమైన కుటుంబానికి ఆధారం", "పిల్లల మధ్య ఎడం పాటిద్దాం -- ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం" అనే నినాదాలతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైద్య, ఆరోగ్య సిబ్బందికి పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలు, బహుమతులు అందజేస్తామని తెలిపారు. జిల్లాను కుటుంబ సంక్షేమ కార్యక్రమాల్లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం, జిల్లా సమన్వయ వైద్య సేవల అధికారి డాక్టర్ మధుసూదన్, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ శ్రీదేవి, గణాంక అధికారి కళాధర్, జిల్లా కార్యక్రమాల నిర్వహణ అధికారి నాగరాజు, జిల్లా ప్రజారోగ్య నర్సింగ్ అధికారి వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగంగా మద్యం సేవించిన 11 మందికి రూ.11 వేల జరిమానా

పుట్టపర్తి, జూలై 9 అనంత సూర్య: పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడ్డ 11 మందికి ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున మొత్తం రూ.11,000 జరిమానా విధించినట్లు అర్బన్ సీఐ యువరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. తనిఖీల్లో పట్టుబడ్డ 11 మందిపై కేసులు నమోదు చేసి పుట్టపర్తి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి వారిపై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ యువరాజు హెచ్చరించారు.



# ఉపాధి హామీ పనులను లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతం చేయాలి

**• పుట్టపర్తి క్లస్టర్ ఏపీడీ రమేష్ బాబు**



ఓడిచెరువు, జూలై 9 అనంత సూర్య: ఉపాధి హామీ పథకం అమలులో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు, నిర్దేశించిన లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని పుట్టపర్తి క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ) రమేష్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం ఓడిచెరువులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి 125 పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీలకు వేతన చెల్లింపులు సక్రమంగా జరగాలంటే పని ప్రదేశంలో తప్పనిసరిగా రెండు అటెండెన్స్ ఫొటోలు నమోదు చేయాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీల దినసరి వేతనాన్ని రూ.312కు పెంచినట్లు వివరించారు. సోమవారం నుంచి అన్ని గ్రామపంచాయతీల్లో ఉపాధి పనులను ప్రారంభించి, కూలీలకు విస్తృతంగా ఉపాధి కల్పించాలని ఆదేశించారు. క్లస్టర్‌కు 4,622 మంది కూలీల లక్ష్యాన్ని నిర్దేశించినందున ప్రతి గ్రామంలో మొబిలైజేషన్ సమావేశాలు నిర్వహించి కూలీలను పనులకు తీసుకురావాలని సూచించారు. హార్టికల్చర్ పనులకు 250 లక్ష్యం ఉండగా ప్రస్తుతం పురోగతి ఆశించిన స్థాయిలో లేదని పేర్కొంటూ, రైతులను చైతన్యపరిచి ఉద్యానవన పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో, ఏపీవో, ఈసీ, సాంకేతిక సహాయకులు సాయినాథ్ రెడ్డి, లక్ష్మీకర్ రెడ్డి, ఆంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టీజీఎస్–360తో నాలుగు నెలలుగా కనిపించని బాలుడి ఆచూకీ



పుట్టపర్తి, జూలై 9 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్‌టీజీఎస్--360 సహాయంతో నాలుగు నెలలుగా కనిపించకుండా ఉన్న ఓ బాలుడిని గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. గండ్లపెంట మండలం జీనులకుంట గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి మార్చి 26న పాఠశాల నుంచి వెళ్లిపోయి తిరుపతి, హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల్లో సంచరిస్తూ ఉన్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు బాలుడి వివరాలను ఆర్‌టీజీఎస్--360లో నమోదు చేసి రాష్ట్రవ్యాప్తంగా గాలింపు చేపట్టారు. జూలై 9న బాలుడు స్వచ్ఛందంగా స్వగ్రామానికి చేరుకోగా, చదువు ఇష్టం లేక ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసుల విచారణలో తెలిపాడు. అనంతరం బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇంటి నుంచి పిల్లలు, వృద్ధులు లేదా మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు కనిపించకుండా పోయిన వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే, వారి వివరాలను ఆర్‌టీజీఎస్--360లో నమోదు చేసి త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని జిల్లా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బదిలీపై వెళ్తున్న బ్యాంకు మేనేజర్‌కు ఘన సన్మానం



నల్లమాడ, జూలై 9 అనంత సూర్య: సత్యసాయి జిల్లా నల్లమాడలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ వి. శరత్ కుమార్ దొరై విజయవాడ కొత్తపేట శాఖకు బదిలీ కావడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానిక ప్రముఖులు ఘనంగా సన్మానించారు. మండల కన్వీనర్ మైలే శంకర్, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు ఆధ్వర్యంలో దొరైకు పూలమాలలు వేసి, శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా శరత్ కుమార్ దొరై రైతులకు సకాలంలో రుణాలు అందించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తూ మంచి పేరు సంపాదించారని కొనియాడారు. ఆయన ఎక్కడ విధులు నిర్వహించినా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆశీస్సులతో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అరవింద్ బాబు, అక్కులప్ప నాయక్, వలం కృష్ణయ్య, బి. మోహన్ నాయుడు, బ్యాంకు సిబ్బంది సమత, రమణ, సాయికృష్ణ, పవన్ కుమార్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, ఎన్. రమణ, రమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# భార్యపై హత్యాయత్నం కేసులో భర్త అరెస్ట్



నల్లమాడ, జూలై 9 అనంత సూర్య: భార్యపై కట్టెతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తిని నల్లమాడ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. దొన్నికోట గ్రామానికి చెందిన మహేష్ (39)కు చంద్రకళతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ కలహాల కారణంగా గత ఐదేళ్లుగా ఇద్దరూ వేర్వేరుగా నివసిస్తున్నారు. ఈ నెల 5న తిరిగి కలిసి జీవిద్దామని నమ్మించి భార్యను ఇంటికి పిలిపించుకున్న మహేష్, ఆమె ఇంటిని శుభ్రం చేస్తున్న సమయంలో కట్టెతో తలపై బలంగా కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని తొలుత కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి బెంగళూరులోని ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతోంది. నిందితుడి ఆచూకీపై వచ్చిన సమాచారం మేరకు దొన్నికోట సమీపంలో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని ఒప్పుకున్న నిందితుడు దాచిపెట్టిన కట్టెను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు ఆస్తిగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు నల్లమాడ ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# విధి నిర్వహణలో సీఆర్పీఎఫ్ ఎస్ఐ మృతి.. స్వగ్రామంలో విషాదం

గోరంట్ల, జూలై 9 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం



దిగు గంగంపల్లి గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ సబ్ ఇన్స్పెక్టర్ యనమల రవిచంద్ర రెడ్డి విధి నిర్వహణలో ఉండగా మృతి చెందినట్లు సమాచారం .రవిచంద్ర రెడ్డి శ్రీనగర్ సమీపంలో సీఆర్పీఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. యనమల నంజిరెడ్డి, లక్ష్మీ దేవమ్మ దంపతుల నాలుగో సంతానమైన ఆయన సుమారు 36 ఏళ్లుగా సీఆర్పీఎఫ్‌లో సేవలందిస్తూ దేశ సేవలో విశేష కృషి చేశారు.రెండు రోజుల క్రితం రాత్రి విధుల్లో ఉండగా ఆయన మృతి చెందినట్లు సమాచారం. అయితే, మరణానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు.రవిచంద్ర రెడ్డి మృతి వార్తతో దిగు గంగంపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతిపై అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.

# నేడు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పర్యటన

పుట్టపర్తి, జూలై 9 అనంత సూర్య: పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి శుక్రవారం పుట్టపర్తిలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.ఉదయం 10.30 గంటలకు చిత్రావతి రోడ్డులో ఏర్పాటు చేసిన ఫుడ్ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే. రత్నాకర్, జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ పాల్గొంటారు.అనంతరం ఉ



దయం 11.30 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించే ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు..

# ఎస్ఐఆర్ నమోదు ఫారాల డిజిటలైజేషన్‌పై జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**అలసత్వం వహిస్తే కఠిన చర్యలు: జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**



హిందూపూర్, జూలై 9 అనంత సూర్య: హిందూపూర్ మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర సవ-రణ) నమోదు ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.హిందూపూర్ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ కేంద్రాల నమోదు ఫారాల డేటా నమోదు తీరును పరిశీలించిన ఆయన రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో డిజిటలైజేషన్ అత్యంత కీలకమైనదని, డేటా నమోదు సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి ఖచ్చితత్వంతో పని చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని, ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఎన్నికల



విధుల్లో నిర్లక్ష్యం లేదా అలసత్వం ప్రదర్శించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీవో, ఎన్నికల విభాగం సూపర్‌వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు..

# మహిళలు, చిన్నారుల భద్రతపై శక్తి టీం అవగాహన



పుట్టపర్తి, జూలై 9 అనంత సూర్య: జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఆదేశాల మేరకు శ్రీ సత్యసాయి జిల్లా శక్తి టీం ఆధ్వర్యంలో మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా శక్తి యాప్ వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో దాని ఉపయోగాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ రుణ యాప్‌లు, బ్యాంకు మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాల దుష్పరిణామాలు, పోక్సో చట్టం, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, వాటికి సంబంధించిన చట్టపరమైన చర్యలను వివరించారు.అత్యవసర సేవల కోసం 100/112, మహిళల హెల్ప్‌లైన్ 181, అగ్నిమాపక సేవల కోసం 101, సైబర్ మోసాల ఫిర్యాదులకు 1930, బాలల సహాయ నంబర్ 1098 గురించి ప్రజలకు వివరించారు.గ్రామ ప్రజలు, మహిళలు, యువత పెద్దఎత్తున పాల్గొని అవగాహన కార్యక్రమాన్ని ఆసక్తిగా విన్నారు. ప్రజల భద్రత, మహిళల రక్షణ, చిన్నారుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని శక్తి టీం సభ్యులు తెలిపారు.

# సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి




సోమందేపల్లి, జూలై 9 అనంత సూర్య: ఈ నెల 27, 28, 29 తేదీల్లో శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ మేరకు సోమందేపల్లి సీపీఐ పార్టీ కార్యాలయంలో గురువారం శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. హిందూపురం నియోజకవర్గంలోని లేపాక్షి మండల కేంద్రంలో మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణా తరగతులకు సీపీఐ జాతీయ, రాష్ట్ర నాయకులతో పాటు ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, మేధావులు హాజరై వివిధ అంశాలపై ప్రసంగించనున్నట్లు తెలిపారు.జిల్లాలోని అన్ని మండలాల నుంచి జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, మండల కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, ముఖ్య నాయకులు పెద్దఎత్తున పాల్గొని శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ బాలస్వామి, మండల కార్యదర్శి కామ్రేడ్ రాజగోపాల్, నాయకులు శీలా నారాయణస్వామి, గంగరాజు, మల్లేష్, రాజేష్, సహాయ కార్యదర్శి అంజనమ్మ, నూర్జాన్, బేబీ, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి నేతల త్యాగాలను స్మరించుకుందాం: విష్ణువర్ధన్ రెడ్డి

పుట్టపర్తి, జూలై 9 అనంత సూర్య: దేశం కోసం ప్రాణాలర్పించిన విద్యార్థి నేతల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి, జాతీయ చైతన్యం, సేవా భావాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలనే లక్ష్యంతో 1949 జూలై 9న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భవించిందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు యస్. విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.ఏబీవీపీ ఆవిర్భావం నుంచి విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యా రంగ అభివృద్ధి, జాతీయ సమైక్యత, సామాజిక సేవలో విశేష సేవలందిస్తూ విద్యార్థి శక్తిని దేశ నిర్మాణ శక్తిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన విద్యార్థి నేతల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని “జ్ఞానం -- శీలం -- ఏకత” అనే ఆదర్శాలతో సంస్థ ముందుకు సాగడం అభినందనీయ-ఎమన్నారు.ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంస్థ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు, విద్యార్థులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థి శక్తి దేశ ప్రగతికి



బలమైన పునాదిగా నిలవాలని ఆకాంక్షించారు.

# ఇదే స్ఫూర్తితో పనిచేయండి

**• హౌసింగ్ పీడీ శైలజను అభినందించిన ఎండీ అరుణ్ బాబు**

అనంతపురం, జూలై 9 అనంత సూర్య: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై--2.0) అమలులో అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలవడంపై రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ బాబు హౌసింగ్ పీడీ శైలజతో పాటు ఆమె బృందాన్ని అభినందించారు.శ్రీ సత్యసాయి జిల్లా పర్యటనకు ముందు అనంతపురానికి చేరుకున్న ఎండీ అరుణ్ బాబును పీడీ శైలజ, శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో పీఎంఏవై--2.0 అమలు తీరుపై ఆరా తీసిన ఆయన, డివిజన్‌ల వారీగా ప్రగతి నివేదికలను పరిశీలించారు.పీఎంఏవై--2.0 గ్రౌండింగ్‌లో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన పనితీరు కనబర్చాలని పీడీ శైలజతో పాటు అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ ఖాసీం, డీఈఈలు శ్రీమన్నారాయణ, హనుమప్ప, షాషావలి, జలీల్ అహమ్మద్, విజయ-



భాస్కర్, మండల ఇన్‌చార్జిలు లోకేష్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# ‘మీ భూమి-మీ హక్కు’ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు






**బనగానపల్లెలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ**

బనగానపల్లె, జూలై 9 అనంత సూర్య: నంద్యాల జిల్లా బనగానపల్లెలో నిర్వహించిన ‘మీ భూమి--మీ హక్కు’ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని అర్హులైన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశా-రు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదిక సభలో ప్రభుత్వం చేపడుతున్న భూ సంస్కరణలు, రైతు సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు.సభా ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను సందర్శించిన ముఖ్యమంత్రి, మంత్రులు ప్రజలకు అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బూడిదగడ్డపల్లిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించిన వైద్యులు**

గోరంట్ల, జూలై 9 అనంత సూర్య: ఆయుష్ శాఖ డైరెక్టర్ గోపాలకృష్ణ, ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ బి. నాగముని సాయి ఆదేశాల మేరకు గోరంట్ల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి డాక్టర్ పి. సునీత ఆధ్వర్యంలో గురువారం బూడిదగడ్డపల్లిలోని శ్రీ గాయత్రి సాయి ఆలయంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు.శిబిరానికి వచ్చిన రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశా-రు. ఈ సందర్భంగా వేసవి నుంచి వర్షాకాలానికి మారే సమయంలో వచ్చే జ్వరం, దగ్గు, జలుబు, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రోగనిరోధక శక్తి పెంచుకునేందుకు ఆయుర్వేద ఔషధాలు, తేలికగా జీర్ణమయ్యే ఆహారం, కాచి చల్లార్చిన నీరు, చిరుధాన్యాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో దగ్గు, జలుబు, శ్వాసకోశ, జీర్ణకోశ, చర్మ, కీళ్ల నొప్పులు తదితర వ్యాధులకు ఉచిత చికిత్సతో పాటు రోగనిరోధక శక్తిని పెంచే ఔషధాలు, యోగ, ప్రాణాయామ శిక్షణ కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9



గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పి. నాగమణి, యోగ శిక్షకురాలు టి. త్రివేణి పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి



**అధికారులకు కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశం**



అనంతపురం, జూలై 9 అనంత సూర్య: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు.న్యూఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ డాక్టర్ పవన్ కుమార్ శర్మ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఈఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 12వ తేదీలోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌లో 70 శాతానికి పైగా పూర్తి చేసిన బీఎల్‌ఓలు తమ పరిధిలోని బూత్ స్థాయి ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి, గైర్హాజరు, మారిన, మరణించిన, డూప్లికేట్ ఓటర్ల జాబితాలను అందజేసి అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలని ఆదేశించారు.అలాగే బీఎల్‌ఓల హాజరును ఈఆర్‌ఓలు ప్రతిరోజూ పర్యవేక్షించాలని, శనివారం, ఆదివారం నిర్వహించే ప్రత్యేక ప్రచార దినాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, డీఆర్‌ఓ ఏ. మలోల, ఆర్‌డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# గోరంట్లలో నూతన ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు



### మంత్రి సవితమ్మ ఆదేశాలతో పనులు ప్రారంభం

గోరంట్ల, జూలై 9 అనంత సూర్య: గోరంట్ల పట్టణంలో పాడై వెలగని వీధి దీపాల స్థానంలో నూతన ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేసే పనులు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు ఇతర ప్రాంతాల్లో వీధి దీపాలు పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం సిక్స్ మెన్ కమిటీ సభ్యులు మంత్రి ఎస్. సవితమ్మ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే కొత్త ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి గురుస్వామి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రధాన రహదారిలో కొత్త ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేశారు. పనులను ఎంపీడీవో కమలాబాయి, సంజయ్ కుమార్ నాయక్, సిక్స్ మెన్ కమిటీ సభ్యులు గిరిధర్ గౌడ్, షేక్ అజ్మతుల్లా, బీ.ఆర్. వేణుగోపాల్ రాయల్, జయరామ్, నిమ్మల శ్రీధర్, మాజీ వార్డు సభ్యులు ఆగిశం నాగరాజు, శంకర్, మహేంద్ర, జనసేన నాయకుడు సంతోష్ కుమార్ తదితరులు పరిశీలించారు.

# ‘అనంత సాయి మహా సంగ్రామం’ను విజయవంతం చేయాలి

### సీపీఎస్ ఉద్యోగులకు సంఘాల నాయకుల పిలుపు



గోరంట్ల, జూలై 9 అనంత సూర్య: నూతన పెన్షన్ విధానం (సీపీఎస్) రద్దు డిమాండ్‌తో ఈ నెల 11న అనంతపురంలో నిర్వహించనున్న ‘అనంత సాయి మహా సంగ్రామం’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ సీపీఎస్ఈఏ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో అనంతపురం, శ్రీ సత్యసాయి ఉమ్మడి జిల్లాల కార్యవర్గాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు నీలం అశోక్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు పొట్టిపాటి జగదీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మాయకుంట్ల రవికుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.కే. వరప్రసాద్ మాట్లాడుతూ, సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్ భద్రత కోసం ఈ ఉద్యమం కీలకమని అన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్, ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావుతో పాటు పాత పెన్షన్ విధానం అమలు చేసిన ఐదు రాష్ట్రాల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కూడా హాజరవుతున్నట్లు తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఎస్ ఐ ఆర్ ఓటరు నమోదను పరిశీలించిన తహసిల్దార్ ఉమామహేశ్వర్ రెడ్డి



ముదిగుబ్బ,జులై 9, అనంత సూర్య:ముదిగుబ్బ మండల పరిధిలోని మలక వేముల గ్రామ సచివాలయాన్ని ఓటరు ఎస్ ఐ ఆర్ సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా అని తహసిల్దార్ ఉమామహేశ్వర్ రెడ్డి గురువారం మలక వేముల గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు ఈ ఓటర్ నమోదు భాగంగా గ్రామ సచివాలయాన్ని పరిశీలించి తహసిల్దార్ మాట్లాడుతూ బూతుల బిఎల్వోలు ( 82- 83- 84- 85) బూతులు సంబంధించిన బిఎల్వోలు ఎస్ ఐ ఆర్ సిస్టంలో ఒక్క ఓటరు కూడా మిస్ కాకుండా చనిపోయిన వారి ఓటర్స్ డిలీట్ చేసి రెండు చోట్ల ఉన్న వారి ఆప్షన్ ఓటర్స్ కే ఇచ్చి వారి ఆప్షన్ ప్రకారం ఓటును తొలగించి ఒక చోట మాత్రమే ఎంపిక చేయండి 2002 సంవత్సరంలో నవోదయ తల్లి తండ్రి ఇద్దరూ మ-రణించినచో వారిద్దరిలో ఒకరి సీరియల్ నెంబర్ నమోదు చేయాలి అలాగే అతీతంగా నచ్చిన ప్రాంతాల్లోనే ఓటరు నిలుపుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో -82- బూతు బి ఎల్ ఓ ఆంజనేయులు -83- బూత్ బి ఎల్ ఓ నరేంద్ర కుమార్-84- బూత్ బి ఎల్ ఓ చంద్రిక-85- బూత్ బి ఎల్ ఓ పవన్ కుమార్ మలక వేముల తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి మల్లికార్జున ఓటర్స్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నవధాన్యాలు సాగు చేద్దాం భూమిని సురక్షించుకుందాం

### నల్లమాడ మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్

నల్లమాడ,జూలై 9 , అనంత సూర్య:పీఎండిఎస్ (నవధాన్యాలు) సాగు వల్ల కొంతవరకు భూమిని సంరక్షించుకుంటామని నల్లమాడ మండల వ్యవసా-య అధికారి అబ్దుల్ హక్ సూచించారు. నల్లమాడ మండలం చారుపల్లి గ్రామం లో భాస్కర్ రెడ్డి రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా సీడ్ పెల్లెటై జేషన్,ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ కార్యక్రమాన్ని ఏవో,ఏపీ సీఎన్ఎఫ్ డివిజన్ ఇంచార్జ్ దామోదర్ రెడ్డి,మండల్ కోఆర్డినేటర్ రమణ, పరిశీలించారు. సీడ్ పెల్లెటైజేషన్, ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ చేయడం భూమిలోని శత్రు పురుగు మిత్ర పురుగు సురక్షితంగా ఉ ంటాయన్నారు. వర్షాలు ప్రారంభమయ్యే ముందుగానే విత్తనాలను పెల్లెటైజేషన్ చేసి పొలంలో విత్తడం ద్వారా తొలి వర్షాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఈ విధానంతో విత్తనాలమొలకశాతం మెరుగు పడటంతో పాటు పంట ప్రారంభ దశలో మంచి ఎదుగు దలనమోదవుతుందని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు విస్తృతంగా అవలం బించి తక్కువ పెట్టుబడితో అధిక దిగు బడులు సాధించాలని సూచించారు. మండల



వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్,ఏ ఈ ఓ రంగాచారి,ఎంపీ ఈవో భాస్కర్ నాయక్,డీవిజన్ ఇంచార్జ్ దామోదర్ రెడ్డి, మండల కోఆర్డినేటర్ రమణ,ఏపీసీయన్ఎఫ్ సిబ్బంది,రమణ మరియు ఇతర రైతులు పాల్గొన్నారు.

# కిసాన్ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా ముచ్చుకోట్ల గోవర్ధన్ నియామకం

### ఘనంగా సన్మానించిన జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాష్ నాయుడు



కదిరి, జూలై 9 అనంత సూర్య: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా ముచ్చుకోట్ల గోవర్ధన్ నియమితులైన సందర్భంగా కదిరి పట్టణంలో శ్రీ సత్యసాయి జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు సోమల ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సోమల ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర నాయకత్వం గోవర్ధన్‌పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని సోషల్ మీడియా వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్తారని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని శుభాకాంక్షలు తెలిపారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చింతా శరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి సోషల్ మీడియా కీలక వేదికగా మారిందని, గోవర్ధన్ సేవలు రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి మరింత ఉపయోగపడతాయని అన్నారు. ముచ్చుకోట్ల గోవర్ధన్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు జయచంద్రారెడ్డి, బీజేపీ నాయకులు మైనుద్దీన్, రామచంద్రరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.

# లోకేష్‌పై ఆరోపణలు చేసిన ప్రకాష్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

### ఎమ్మెల్యే సురేంద్రబాబు డిమాండ్



అనంతపురం, జూలై 9 అనంత సూర్య: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజుపై వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెస్ రాజుపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా ఆయన నివాసంలో గురువారం జరిగిన సమావేశంలో పాల్గొన్న సురేంద్రబాబు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలు సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలు, కులాలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం రాజకీయ విలువలకు విరుద్ధమని అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గతంలో హుందాతనంతో రాజకీయాలు జరిగేవని, ప్రస్తుతం కొందరు వ్యక్తిగత విమర్శలు, చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా ఎవరూ వ్యవహరించరాదని సూచించారు. మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజుపై చేసిన వ్యాఖ్యలకు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలను ప్రజలే తిరస్కరిస్తారని ఎమ్మెల్యే సురేంద్రబాబు పేర్కొన్నారు..

# బీజేపీ నూతన కార్యదర్శి,ప్రధాన కార్యదర్శి లకు ఘన సన్మానం



గోరంట్ల, జూలై 9 అనంత సూర్య: భారతీయ జనతా పార్టీ జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నర సింహులు, కార్యదర్శిగా నగేష్ నియమితులైన సందర్భంగా గోరంట్ల భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు, ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ పూల గంగాధర్, ప్రధాన కార్యదర్శి భజంత్రీ శంకర, జిల్లా ఉపాధ్యక్షు రాలు ముంతాజ్, లక్ష్మిరెడ్డి, మైనార్టీ ఉపాధ్యక్షుడు షబ్బీర్, కొత్తిమీర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని విజ్ఞప్తి



కదిరి, జూలై 9 అనంత సూర్య : ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (ఆ=వీ) చంద్రశేఖర్ గుప్తాకు భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో ముదిగుబ్బ రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులకు ఉపయోగపడే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాప్ లేకపోవడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సుమారు 65 వేల మందికి పైగా ప్రజలు ఈ రైల్వే స్టేషన్‌పై ఆధారపడుతున్నందున 12765-12766, 16339-16340, 12769-12770, 07191-07192, 12731-12732 నంబర్ల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ముదిగుబ్బ రైల్వే స్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని కోరారు. అలాగే నరసాపురం ఎక్స్ప్రెస్ సమయం మార్పు చేయాలని కోరారు. మరికొన్ని రెగ్యులర్ ట్రైన్స్ ని కదిరి మీదుగా నడిపే విధంగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా గారికి వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శరత్ కుమార్ రెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సోమల ప్రకాష్ నాయుడు, కిసాన్ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్ ముచ్చుకోట్ల గోవర్ధన్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దేశాయి జయచంద్రారెడ్డి, మైనార్టీ రాష్ట్ర నాయకులు మైనుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శివప్రసాద్ రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405